
సాక్షి
కర్నూలు

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



నందీశ్వరుడికి అభిషేకం

మహానంది: పాల్గుణ కృష్ణ త్రయోదశి పురస్కరించుకుని శనివారం మహానంది ఆలయ ఆవరణలోని నందీశ్వరుడికి ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు.



ఒక్క రోజు ఆదాయం..

బేతంచెర్ల: శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి దేవస్థానానికి శనివారం ఒక్క రోజు రూ.7.61.013 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.



అలరించిన ప్రదర్శనలు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలు అలరించాయి. వేణుగానం, తబలా కచేరి, నందికొట్కూర్ కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



	ఇఫ్తార్	సహర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:42
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:45
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:39
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:40
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:40

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

పేదలకు విరివిగా దానధర్మాలు చేయండి. పవిత్ర రంజాన్ మాసంలో ఒక్క రూపాయి దానం చేస్తే సాధారణ రోజుల్లో డెబ్బై రూపాయలు చేసినంత పుణ్యం లభిస్తుంది.

– పవిత్ర ఖురాన్

ఏటేటా పింఛను వసంతం

- ఐదేళ్లు క్రమంగా పెరిగిన పింఛన్
- ఇంటి వద్దనే ఠంచన్‌గా అందజేత
- అవ్వాతాతల్లో పెరిగిన ఆత్మస్థైర్యం
- రాజకీయ సిఫార్సులకు తావులేకుండా లబ్ధిదారుల ఎంపిక
- అప్పటి కష్టాలు వద్దంటున్న దివ్యాంగులు
- చంద్రబాబు తీరుపై మండిపడుతున్న వృద్ధులు

కర్నూలు(అగ్రికల్చర్): ఏ పనీ చేయలేని అవ్వాతాతలు, అభాగ్యులైన అక్కాచెల్లెమ్మలు, ఆదరణ లేని దివ్యాంగులు.. వీరందరూ సమాజంలో గౌరవంగా, ఆత్మస్థైర్యంతో బతికే అవకాశాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించింది. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా సామాజిక భద్రత పింఛన్లు అందిస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా పింఛన్ మొత్తాన్ని ప్రతి ఏటా పెంచుకుంటూ పోతూ 2024 జనవరి 1 నాటికి రూ.3,000 చేసి పండుటాకుల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెలుగులు నింపారు. చంద్రబాబు హయాంలో పింఛన్లను ఎలా తగ్గించాలా అనే కోణంలో ఆలోచిస్తే.. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అర్హులు ఏ ఒక్కరూ పింఛన్‌కు దూరం కాకూడదనే లక్ష్యంతో పనిచేస్తోంది.

పెరిగిన పింఛన్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2018 డిసెంబరు నాటికి 3,61,563 పింఛన్లు ఉండేవి. వీటికి రూ.40.27 కోట్లు మాత్రమే నగదు పంపిణీ చేశారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో నేడు పింఛన్ల సంఖ్య 4,73,913కు చేరింది. టీడీపీ హయాంతో పోలిస్తే 1,12,350 పింఛన్లు పెరిగాయి. పింఛన్ల కోసం పంపిణీ చేసే మొత్తం రూ.141.41 కోట్లకు చేరింది. టీడీపీ హయాంలో వృద్ధులు పింఛన్ పొందాలంటే 65 ఏళ్లు నిండాల్సి ఉండి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే పింఛన్ అర్హత వయస్సు 60 సంవత్సరాలకు తగ్గించారు. అర్హత వయస్సు తగ్గించడంతో వేలాది మంది వృద్ధులకు లబ్ధిచేకూరుతోంది.



అవ్వకు పింఛన్ అందజేస్తున్నవలంటీర్ (ఫైల్)

నాడు 10 రకాలు..
నేడు 16 రకాల పింఛన్లు

టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో 10 రకాల పింఛన్లు మాత్రమే పంపిణీ చేసేవారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేత, కల్లుగీత, మత్స్యకార, అభయహస్తం, ఒంటరి మహిళ, కళాకారుల, చర్మకారుల పింఛన్లు ఇచ్చేవారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత పింఛన్ల సంఖ్య 16కు చేరడం విశేషం. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో కిడ్నీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి రూ.5000 నుంచి రూ. 10 వేల వరకు ఫింఛన్ వస్తోంది. హిజ్రాలు, డప్పుకళాకారులతో పాటు సైనిక్ వెల్ఫేర్ పింఛన్‌లు కూడా పంపిణీ చేస్తూ వేలాది మంది జీవితాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసా ఇస్తోంది. ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు.

నాడు..

టీడీపీ హయాంలో ఎంత మంది అర్హులు ఉన్నా మండలానికి ఇన్నే పింఛన్లు అని కోటా పెట్టేవారు. ఒక్కో గ్రామానికి 10–15 వరకు పింఛన్లు వచ్చేవి. జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుంటే లబ్ధిదారులుగా ఎంపిక చేసేవారు. ఇందుకోసం నాలుగైదు నెలల పింఛన్ మొత్తాన్ని లంచంగా ముట్టచెప్పాల్సి వచ్చేది. ప్రతి నెలా ఇచ్చే పింఛన్‌లోనూ రూ.100, 200 కోత పెట్టేవారు. మరణించిన వారిస్థానంలోనే కొత్త పింఛన్ వచ్చేది. టీడీపీ హయాంలో పింఛన్ పొందడంలో అవ్వాతాతలు, దివ్యాంగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాల ప్రాంగణాలు, రచ్చబండల దగ్గర పడిగాపులు కాసేవారు. డబ్బులు రాలేదు.. రేపు..మాపు అంటూ తిప్పుకునేవారు.

నేడు..

వైఎస్సార్‌సీపీ పాలనలో పింఛన్‌దారుల కష్టాలు తొలగిపోయాయి. అర్హతే ప్రామాణికంగా తీసుకొని రాజకీయాలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారు. ప్రతి 50 ఇళ్లకు గ్రామ, వార్డు వాలంటీర్లను నియమించి... వారి ద్వారా నేరుగా ఇంటికే పింఛన్ సొమ్ము పంపే ఏర్పాటు చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీ పండుగ ఉన్నా.. సెలవైనా... వానొచ్చినా.. ఇంటికే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. దీంతో అవ్వాతాతలు, దివ్యాంగుల కష్టాలు తొలగిపోయాయి. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుంటే అక్కడికే వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు.



పింఛన్ల పెంపు ఇలా..



ఈ చిత్రంలోని మహిళ పేరు గుర్రాల తిప్పమ్మ. కల్లూరు మండలం పర్ల గ్రామానికి చెందిన ఈ వృద్ధురాలు ప్రస్తుతం మంచానికే పరిమితం అయ్యింది. ప్రతి నెలా 1వ తేదీనే వలంటీరు ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తుండటంతో ఈమె సంతోషం వ్యక్తం చేస్తోంది. టీడీపీ హయాంలో పింఛన్ పొందడానికి చాలా కష్టాలు పడ్డామని ఈమె చెప్పారు. అప్పట్లో ఎప్పుడిస్తారో తెలిసేది కాదని, ప్రస్తుతం ఠంచన్‌గా పింఛన్ అందుతోందని, పింఛన్ మొత్తాన్ని రూ.3000కు పెంచడంతో తనలాంటి వృద్ధులకు ఉపశమనాన్ని ఇస్తోందని ఈమె తెలిపారు.



ఈ చిత్రంలో కనిపించే వ్యక్తిపేరు ఎస్. హస్నొద్దీన్. కర్నూలు నగరం కండేరీ ప్రాంతానికి చెందిన వారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈయన మూత్ర పిండాల వ్యాధితో ప్రతి నెలా డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోంది. ఈయన ఆర్థిక పరిస్థితిని పరిశీలించిన జిల్లా యంత్రాంగం సీకేడీయు పింఛన్ కోసం సిఫార్సు చేసింది. జాప్యం లేకుండా ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. ఈ పింఛన్ కింద ప్రతి నెలా రూ.10 వేలు వస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీనే వార్డు వలంటీరు ఇంటికే వెళ్లి అందిస్తున్నారు.

చంద్రబాబును నమ్మబోం..

దళారులను ఆశ్రయించకుండా, రాజకీయ సిఫారస్సులు లేకుండా అర్హతనే ప్రాణాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పింఛన్లు అందిస్తోందని అవ్వాతాతలు, దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, పంచాయతీ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరిగినా పింఛన్ వచ్చేది కాదంటూ గుర్తు చేసుకుంటున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కారణంగా మళ్లీ అవే కష్టాలు మొదలయ్యాయని, పింఛన్ అందుకోవడానికి ఎర్రటి ఎండలో పడరాని పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబును నమ్మేది లేదంటూ చెబుతున్నారు.

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో లబ్ధిదారులు, పింఛన్ బడ్జెట్ సంవత్సరాల వారీగా

సంవత్సరం	కర్నూలు జిల్లా		నంద్యాల జిల్లా	
	లబ్ధిదారులు	పింఛన్ మొత్తం (రూ.కోట్లలో)	లబ్ధిదారులు	పింఛన్ మొత్తం (రూ.కోట్లలో)
2019	2,02,687	553.28	1,89,088	490.08
2020	2,18,951	630.96	2,01,566	579.48
2021	2,29,647	693.84	2,11,914	610.44
2022	2,32,876	711.12	2,11,805	643.92
2023	2,38,192	765.48	2,16,135	715.8
2024 (మూడు నెలలు)	2,47,546	223.59	2,23,601	206.64

న్యూస్‌రీల్

కందులు క్వింటా రూ.10,761

కర్నూలు(అగ్రికల్చర్): కందుల ధర జోరు మీద ఉంది. 2023–24 సంవత్సరం మొత్తం కందుల ధర ఆకాశాన్నంటింది. ఏప్రిల్ నెలలో కూడా ధరల పెరుగుదల కొనసాగుతోంది. వర్షాభావం వల్ల వివిధ పంటల్లో దిగుబడులు పడిపోయిన నేపథ్యంలో రైతులకు ధరలు ఊరట నిస్తున్నాయి. శనివారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కందుల ధర మరింత పెరగడం విశేషం. మార్కెట్‌కు 102 మంది రైతులు 351 క్వింటాళ్ల కందులు తీసుకొచ్చారు. కనిష్ట ధర రూ.1,002, గరిష్ట ధర రూ.10,761.. సగటు ధర రూ.10,681 పలికింది. ఈ నెల 4న గరిష్ట ధర రూ.10,401 ఉండగా.. మోడల్ ధర రూ.10,226 నమోదైంది. 4వ తేదీతో పోలిస్తే కందుల ధరలు మరింత పెరిగాయి. మార్కెట్‌కు కందులు తెచ్చిన రైతులందరికి రూ.10వేలపైనే ధర లభించినట్లు స్పష్టమవుతోంది.

డిగ్రీ 3, 5 సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వర్సిటీ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. మూడో సెమిస్టర్‌లో రెగ్యులర్ విద్యార్థులు 5,900 మందికిగాను 3,081 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 9,140 మందికి 4,182 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఐదో సెమిస్టర్‌లో రెగ్యులర్ విద్యార్థులు 10,080మందికి గాను 5,652 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 4,244 మందికి 2,229 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. పరీక్షల ఫలితాలు htpp://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

వెటర్నరీ అంబులెన్స్‌లో డ్రైవర్ పోస్టుల భర్తీకి చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖ ఆరోగ్య సేవ వెటర్నరీ అంబులేటరీ సర్వీస్ (1962)లలో డ్రైవర్(పైలెట్) పోస్టులు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లుగా జీవీకే ఈఎంఆర్‌ఐ జిల్లా మేనేజర్ రామకృష్ణగౌడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్ పోస్టులకు 10వ తరగతి చదివి, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, 36 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. వేతనం నెలకు రూ.10800, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం ఉంటుందని, ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9014774741, 9603120997 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

'టెక్నికల్' కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: టెక్నికల్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శామ్యూల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్టణం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురం జిల్లాల్లో మే నెల 1 నుంచి జూన్ 11వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 25వ తేదీలోపు ప్రభుత్వ పరీక్షల విభాగం వెబ్‌సైట్ www.bse.ao.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్‌యూ విద్యార్థులకు ఆరు రోజులు సెలవు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు వరుసగా ఆరు రోజులు సెలవులు వచ్చాయి. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న ఉత్తర్వులు జారీ చేశారు. 9వ తేదీ ఉగాది, 10న ఆప్షనల్ హాలిడే, 11న రంజాన్, 12న ఆప్షనల్ హాలిడే ఇచ్చారు. 13వ తేదీ రెండో శనివారం, 14 ఆదివారం ఇలా వరుసగా ఆరు రోజులు సెలవులు వచ్చాయి. 15వ తేదీ వర్సిటీలో తరగతులు పునః ప్రారంభం కానున్నాయి.

చెక్‌పోస్టుల్లో పటిష్ట నిఘా

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ఉండే చెక్‌పోస్టుల్లో పటిష్ట నిఘా ఉంచాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీసు సూపరింటెండెంట్లు, పోలీసు కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో ఎటువంటి హింస, రీపోలింగ్‌కు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, లిక్కర్, నగదు అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, వ్యక్తులు రూ.50 వేలకు మించి నగదు కలిగి ఉంటే వెంటనే జప్తు చేయాలని ఆదేశించారు. సాధారణ పౌరుల విషయంలో ఆచితూచి అడుగులు వేయాలని, వారిని ఎటువంటి ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. నగదు జప్తు కేసులను 24 గంటల్లోనే పరిష్కరించేందుకు ఎస్‌ఓపీ(స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ని రూపొందించినట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్

ఫలించని 'పచ్చ' కుట్రలు

సచివాలయాల దగ్గర ప్రశాంతంగా పింఛన్ల పంపిణీ

- మూడున్నర రోజుల్లోనే పంపిణీ పూర్తి
- ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం సత్వర చర్యలు
- పంపిణీలో నంద్యాల జిల్లాకు మొదటి స్థానం, కర్నూలు జిల్లాకు 8వ స్థానం

కర్నూలు(అగ్రికల్చర్): పండటాకులను రోడ్డుకీడ్చి ఇబ్బందులకు గురి చేయడానికి చంద్రబాబు ముఠా చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని మండుతున్న ఎండల్లో ఎవ్వరికీ ఇబ్బందులు కలిగించకుండా సచివాలయాల దగ్గర వీలైనంత త్వరగా పంపిణీ పూర్తి చేయడం విశేషం. ఈ నేపథ్యంలో కేవలం మూడున్నర రోజుల్లోనే పంపిణీ పూర్తయింది. పింఛన్ల పంపిణీ ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం నుంచి మొదలైంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉదయం 6 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పింఛన్ల పంపిణీలో నిమగ్నమయ్యారు. పంపిణీలో కర్నూలు జిల్లా 8వ స్థానం, నంద్యాల జిల్లా 2వ స్థానంలో నిలిచాయి.

- కర్నూలు జిల్లాలో మొత్తం పింఛన్లు 2,46,871 ఉండగా.. సాయంత్రం 7 గంటల సమయానికి 2,44,067 పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 98.86 శాతం పంపిణీ పూర్తయింది.
- నంద్యాల జిల్లాలో మొత్తం పింఛన్లు 2,22,938 ఉండగా.. 2,20,795 పింఛన్ల పంపిణీ పూర్తయింది. పంపిణీ 99.07 శాతం నమోదైంది.

భృంగివాహనంపై మల్లన్న వైభోగం

- శాస్త్రోక్తంగా ప్రారంభమైన ఉగాది మహోత్సవాలు
- మహాలక్ష్మి అలంకారంలో కటాక్షించిన శ్రీశైల భ్రామరి

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో శనివారం ఉగాది మహోత్సవాలు ఆగమశాస్త్రానుసారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ నిర్వహణలో భాగంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, స్థానాచార్యులు, అర్చకులు, పండితులు, అధికారులు ఆలయ ప్రాంగణంలో యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం పండితులు చతుర్వేదపారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించారు. స్థానాచార్యులు లోకక్షేమాన్ని కాంక్షిస్తూ ఉత్సవ సంకల్పాన్ని పఠించారు. ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతిపూజ జరిపించారు. అనంతరం పుణ్యాహవచనం చేశారు. యాగశాల ప్రవేశం అనంతరం చండీశ్వరునికి ప్రత్యేకంగా పూజాదికాలు నిర్విహించారు, కంకణాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించి అధికారులు, అర్చకస్వాములు కంకణాలను ధరించారు. రుత్వికులకు దీక్షావస్త్రాలను అందజేశారు. అఖండదీపస్థాపన, వాస్తుపూజ, వాస్తు హోమం నిర్వహించారు. కలశస్థాపన, పంచావరణార్చనలు, జపానుష్ఠానాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనల పూజలను జరిపించారు.

కనుల పండువగా గ్రామోత్సవం

ఉగాది మహోత్సవాల్లో భాగంగా శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహించారు. ప్రత్యేక అలంకీకృతులైన అమ్మవారికి, వాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారిని, భృంగివాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను భక్తులు కనులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. గ్రామోత్సవంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి దంపతులు, ఏఈవో హరిదాసు, శ్రీశైలప్రభ సంపాదకులు అనిల్‌కుమార్, పీఆర్వో టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో నేడు

ఉగాది మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం భ్రమరాంబాదేవికి మహాదుర్గ అలంకారం, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు కైలాసవాహనసేవ నిర్వహించనున్నారు.



ఆలయ ప్రదక్షిణలో ఉత్సవమూర్తులు



కళాకారుల ప్రదర్శన



మహిళల కోలాటం

అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీదే గెలుపు

- పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన సిట్రా సత్యనారాయణమ్మ

కర్నూలు (టౌన్): జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీదే విజయమని, కర్నూలు పార్లమెంట్ స్థానం కూడా అధికార పార్టీ కైవసం చేసుకుంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలిగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. పలువురు పార్టీ నాయకులు ఆమెను సత్కరించారు. అంతకు ముందు వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. వలంటీర్ వ్యవస్థను తొలగించి వృద్ధులను, దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేసిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో పింఛన్ లబ్ధిదారులు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్ష పదవి మహిళకు ఇచ్చారని, జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఎన్నికల వేళ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గద్దం రామకృష్ణ, వైఎస్‌ఆర్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ ఆచారి, జిల్లా కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య, బీసీ సంఘం నాయకులు గుడిసె శివన్న, వైష్ణవ కార్పొరేషన్ డైరెక్టర్ సాయినాథ్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ ట్రేడ్ యూనియన్ నాయకులు వైవీ రమణ, స్వాములు, విద్యార్థి సంఘం నాయకులు సాయి గిరిష్ తదితరులు పాల్గొన్నారు.



సిట్రా సత్యనారాయణమ్మ



సంక్షేమ బావుటా

జలకళ బోరుతో పంటలను కాపాడుకుంటున్నా

నాకు 12 ఎకరాల భూమి ఉంది. ఇద్దరు కొడుకులకు ఎవరి భూమి వారికి ఇచ్చా. నేను రెండెకరాలు ఉంచుకున్నా. ఉన్న నాలుగు బోర్లలో రెండు ఎండిపోయాయి. మూడు ఎకరాల్లో నాటిన సపోట, మునగ పంట చేతికొచ్చే సమయం. ఇటీవల నాలుగు ఎకరాల్లో మామిడి మొక్కలు నాటాం. ఉన్నట్టుండి మరో రెండు బోర్లలో నీళ్లు తగ్గిపోయాయి. ఏం చేయాలో దిక్కుతోచలేదు. ఇలాంటి సమయంలో నా పొలంలో వైఎస్సార్ జలకళ కింద బోరు వేయించుకున్నా. రెండించుల దాకా నీళ్లు పడ్డాయి. ఆ నీళ్లతోనే ఈ రోజు సపోట, మునగ పంటలను కాపాడుకుంటున్నా. ఈ బోరే లేకపోతే చెట్లన్నీ ఎండిపోయేవి. రెండెకరాల్లో వేసిన వేరుశనగ పంట ద్వారా లక్షన్నర వచ్చింది. పైసా ఖర్చు లేకుండా బోరు వేశారు. కరెంటు, బోరు, మోటారు అన్నీ ఉచితంగా ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి రైతులకు ఇలా బోర్లు వేసి, కరెంటు, మోటార్లు ఇవ్వలేదు. ఇలాంటి ముఖ్యమంత్రి మళ్లీ రావాలని కోరుకుంటున్నాం.

– ఏకాశి దేవేంద్ర, రైతు, రాంపల్లి, తుగ్గలి మండలం



క్లుప్తంగా

రూ.60వేల అపరాధ రుసుం వసూలు

కర్నూలు(న్యూటౌన్): ఖనిజ పౌడర్, నాపరా యి అక్రమ రవాణా చేస్తున్న వాహనాలు సీజ్ చేసి, రూ.60వేల అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి. రాజశేఖర్ శనివారం విలేకరులకు తెలిపారు. డోన్ నుంచి కర్ణాటకకు ఖనిజ పౌడర్‌ను అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసి రూ.50వేలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు చెప్పారు. వెల్దుర్తి నుంచి నాపరాయిని అక్రమంగా రవా ణా చేస్తున్న ఐషర్ వాహనాన్ని సీజ్ చేసి రూ. 10వేలు జరిమానా వసూలు చేశామన్నారు. ఐషర్ వాహనాన్ని వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో ఉంచామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన దూదేకుల దస్తగిరి

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని బీరవోలు గ్రామ సమీపంలో శనివారం రెండు ఆటోలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పలుకూరు గ్రామానికి చెందిన కొప్పెర్ల దూదేకుల దస్తగిరి(60)తో పాటు అదే గ్రామానికి చెందిన మరికొందరు కూలీ పనుల కోసం టంగుటూరు గ్రామానికి ఉదయం ఆటోలో బయల్దేరారు. బీరవోలు గ్రామ సమీపంలోని పెద్దమ్మ గుడి వద్ద ఎదురుగా అతి వేగంగా వస్తున్న మరో ఆటో ప్రమాదవశాత్తూ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా దూదేకుల దస్తగిరి కొద్దిసేపటికే మృతి చెందారు. భారతి, లక్ష్మీదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపా ల్ తెలిపారు.మృతుడికి భార్య దస్తగిరమ్మ ఉన్నారు.

రామాలయంలో చోరీ

మద్దికెర: ఎం.అగ్రహారం గ్రామంలోని పురాతన రామస్వామి దేవాలయంలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయ తాళాలు పగులగొట్టి గుడిలో ఉన్న దాదాపు రూ.2 లక్షలు విలువ చేసే సీతారాములు, లక్ష్మణ స్వామి వార్ల ఆభరణాలు అపహరించారు. మూడు కిరీటాలు, అమ్మవారి మంగళ సూత్రం, హుండీ దొంగలించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంతవరకు ఇలాంటి సంఘటనలు జరగలేదన్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మద్దిలేటిస్వామి సేవలో..


కుంకుమార్చన నిర్వహిస్తున్న కర్నూలు ప్రధాన న్యాయమూర్తి దంపతులు

బేతంచెర్ల: మండలపరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామిని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు దంపతులు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు ఆలయ మర్యాదలతో వారికి స్వాగ తం పలికి స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసి, వేదపండితులు ఆశీర్వదించారు.

పార్క్ చేసి ఉంచిన బైక్ చోరీ

కర్నూలు : కర్నూలు శివారు డాక్టర్స్ కాలనీలోని ఎస్‌సీసీ కార్యాలయం వద్ద పార్కు చేసి ఉంచిన బైక్ చోరీకి గురైంది. కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ పవన్ శనివారం ఉదయం తన బైకును కార్యాలయం ముందు పార్కు చేసి సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో బయటకు వెళ్లి చూసుకోగా వాహనం కనిపించలేదు. తన వాహనం చోరీకి గురైనట్లు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నెత్తిన నిప్పుల కుంపటి!

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏప్రిల్ నెల మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు పైగా చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మే నెలలో తీవ్రత ఏ స్థాయికి చేరుతుందో ఊహించుకుంటేనే భయపడాల్సి వస్తోంది. పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు రాజకీయ పార్టీల నేతల ప్రచారానికి ఆటంకం కలిగిస్తున్నాయి. గతేడాది వేసవిలో ఎండల తీవ్రత ఉన్నా సాయంత్రానికి వర్షాలు పడటం, గాలుల వల్ల కాస్త ఉపశమనం లభించేది. ఈ సారి ఆకాశం నిర్మలంగా ఉంటోంది. సూర్యకిరణాలు నేరుగా నేలను తాకుతున్నాయి. వడగాలుల తీవ్రత రెట్టింపు అవుతోంది. రోడ్డుపై నడుస్తున్నా... వాహనంపై వెళ్తున్నా.. బస్సులో ప్రయాణిస్తున్నా.. నెత్తిపై నిప్పుల కుంపటి ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఎండల తీవ్రతతో విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోంది. ఉక్కపోతతో ఫ్యాన్, కూలర్లు, ఏసీలు లేకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో 2023 ఏప్రిల్ నెల 5వ తేదీన 12.72 మిలియన్ యూనిట్‌ల విద్యుత్ వినియోగం ఉండగా... 2024 ఏప్రిల్ 5న విద్యుత్ వినియోగం 14.113 మిలియన్ యూనిట్లకు పెరిగింది. రానున్న రోజుల్లో వినియోగం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కర్నూలులో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు

కర్నూలు నగర ప్రజలు అధిక ఉష్ణోగ్రతలతో విలవిల్లాడుతున్నారు. శనివారం రికార్డు స్థాయిలో 44.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రి ఉష్ణోగ్రత 29 డిగ్రీలుగా ఉంది. ఉదయం 10 గంటల నుంచే నగరంలో ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు బయటికి రాలేకపోతున్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రధాన రహదారులపై రాకపోకలు గణనీయంగా తగ్గిపోయాయి.



ఉష్ణోగ్రతలు పెరగడానికి ఇవీ కారణాలు..

- ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో నీటి నిల్వలు తగ్గిపోయాయి. భూమిలో తేమ లేకపోవడంతో ఎండల తీవ్రతకు నేల నుంచి వేడి సెగలు పుట్టుకొస్తున్నాయి.
- అడవుల విస్తీర్ణం 33 శాతం వరకు ఉండాల్సి ఉండగా.. ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే 16 శాతం మాత్రమే ఉన్నాయి. అడవులు తరిగిపోతుండటం ఎండల తీవ్రత పెరుగడానికి కారణమవుతోంది.
- వాహనాల సంఖ్య పెరుగడంతో కార్బన్ డై ఆక్సైడ్ గాలిలో చేరుతుండటంతో భానుడి భగభగలు పెరుగుతున్నాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- పనులకు వెళ్లిన వారు సాధ్యమైనంత వరకు ఉదయం 11 గంటలలోపు ఇంటికి చేరుకోవాలి.
- ఎండలో బయటికి వెళ్లాల్సిన వచ్చినప్పుడు గొడుగు తీసుకెళ్లాలి. కనీసం తలపైన టోపి లేదా టువాలతో కప్పుకోవడం అవసరం. కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలి.
- దాహం వేయకపోయినా తరచూ చల్లని నీరు తీసుకోవాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, కొబ్బరి నీళ్లు వీలైనంత వరకు ఎక్కువగా తీసుకోవాలి.
- నల్లని దుస్తులు ధరించరాదు. తెల్లని వస్త్రాలు ధరించడం మంచిది.
- మధ్యాహ్నం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు.
- బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు బయటతిరగరాదు.
- తలనొప్పి, తలతిరుగడం, తీవ్రమైన జ్వరం కలిగి ఉండటం, మత్తునిద్ర, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి ఆపస్మారక స్థితి ఇవన్నీ వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగిలిన వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.

శనివారం నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

ప్రాంతం పేరు	ఉష్ణోగ్రత
నందికొట్కూరు	44.9
కొత్తపల్లి	44.8
గూడూరు	44.6
మిడుతూరు	44.5
బనగానపల్లె	44.4
డోన్	44.4
పాణ్యం	44.4
మహానంది	44.3
కోడుమూరు	44.2
శ్రీశైలం	44
సంజామల	44
సి.బెళగల్	44

డోన్‌లో పరస్పర దాడులు

- ముగ్గురికి తీవ్ర గాయాలు




దాడిలో గాయపడిన విజయ్‌కుమార్, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణి సువర్ణ, ఆర్‌ఎంపీ బాలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో శుక్రవారం రాత్రి జరిగిన సంఘటన పరస్పర దాడులకు దారితీసింది. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు బాలు, మరి కొంత మందితో కలిసి శుక్రవారం సాయంత్రం నుంచి బార్‌లో మద్యం సేవిస్తున్నారు. అయితే చాలా సమయం అయిందని, టేబుల్ ఖాళీ చేయాలని బార్ సూపర్‌వైజర్ కేడీ ప్రభాకర్ వారికి సూచించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న బాలు టేబుల్ విరగగొట్టి, రెస్టారెంట్ అద్దాల తలుపులను పగుల గొట్టాడు. సూపర్‌వైజర్ ప్రభాకర్‌ను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఈ సమయంలో బాలు చేతికి గాయాలయ్యాయి. ఇది జరిగిన కొంత సేపటికి విషయం తెలుసుకున్న ప్రభాకర్ తమ్ముడు విజయ్‌కుమార్ పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎదురుగా ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుడు బాలు క్లినిక్‌పై దాడి చేసి అద్దాలను పగుల గొట్టాడు. ఈ విషయం తెలుసుకున్న బాలు శనివారం ఉదయం విజయ్‌కుమార్ ఇంటికి వెళ్లి దాడి చేస్తుండగా విజయ్‌కుమార్ భార్య గర్భిణి సువర్ణ అడ్డు రాగా.. ఇద్దరిపై బాలు విచక్షణ రహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గా యపడిన వారిని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం సువర్ణను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు. బాధితుడు కేడీ ప్రభాకర్ ఫిర్యాదు మేరకు ఆర్‌ఎంపీ వైద్యుడు బాలు, అతని వెంట వచ్చిన పవన్, సునీల్, జగన్‌తో పాటు మరికొంత మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమో దు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. గతంలో పట్టణంలోని పలువురిపై దాడి కేసుల్లో బాలు ముద్దాయిగా ఉన్నట్లు సీఐ తెలిపారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

బొమ్మలసత్రం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు. శనివారం నంద్యాల సెబ్ స్టేషన్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా గతేడాది డిసెంబర్ 26వ తేదీ నుంచి ఇప్పటి వరకు 889 కేసులు నమోదు చేసి 849 మందిని అరెస్టు చేశామన్నారు. 7,834 లీటర్ల నాటు సారా, 1,230 లీటర్ల ఇతర రాష్ట్రాల మద్యం, 1,596 కేజీల బెల్లం, 23 వాహనాలను సీజ్ చేశామన్నారు. అంతేకాకుండా 1,17,460 లీటర్ల నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. నాటు సారా తయారీ, రవాణా తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మధుమోహన్ రావు, సూపరింటెండెంట్ రామోహన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు జి. విశ్వనాథరెడ్డి, జోగేంద్ర, చంద్రమణి, వర్ధనా దేవి పాల్గొన్నారు. అనంతరం ఆయన నందికొట్కూరు, ఆత్మకూరు సెబ్ స్టేషన్లలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. నందికొట్కూరు పరిధిలోని కోళ్ల బాపురం వద్ద వున్న అంతర్రాష్ట్ర చెక్ పోస్టును ఆయన తనిఖీ చేశారు.

ఎలుగుబంటి వేటగాళ్ల అరెస్ట్

ఆత్మకూరు: విద్యుత్ కంచె వేసి ఎలుగుబంటిని వధించిన నలుగురు వేటగాళ్లను అరెస్ట్ చేసినట్లు ఆత్మకూరు డీఎఫ్‌ఓ సాయిబాబా తెలిపారు. స్థానిక అటవీ కార్యాలయంలో కేసు వివరాలను ఆయన మీడియాకు వివరించారు. ఇటీవల కొత్తపల్లి మండలంలో ఎలుగుబంటిని వధించిన కేసును దర్యాప్తు చేస్తుండగా శనివారం ఆత్మకూరు పట్టణ సమీపంలోని సూర్య గార్డెన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న కొత్తపల్లి మండలం శివపురం గ్రామానికి చెందిన నెత్తికొప్పల యేసు రత్నం, మూల శిఖామణి, వడ్డేమాను సద్గుణరావు, నెత్తికొప్పల సాయికుమార్ అదుపులోకి తీసుకుని విచారించగా వేటగాళ్లుగా బయటపడిందన్నారు. వారి నుంచి ఎలుగుబంటి తల, అవయవాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురు వేటగాళ్లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎఫ్‌ఓ తెలిపారు.

మానసిక వేదనతో వృద్ధుడు మృతి

- చివరి రోజు పింఛను అందుకున్న క్షణాల్లోనే మృత్యువాత

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో ఓ వృద్ధుడు శనివారం పింఛను విషయంలో మనో వేదనతో బాధపడుతూ వడదెబ్బతో మరణించాడు. 1వ తేదీన అందాల్సిన పింఛను 5వ తేది దాటినా రాకపోవడం.. సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకు రావడం ఆలస్యం కావడంతో హరిజన అయ్యన్న అనే వృద్ధుడు మనో వేదనకు లోనయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సెక్రటరీకి ఫోన్ చేసి అయ్యన్న సచివాలయం వద్దకు వచ్చే పరిస్థితి లేదని, ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేయాలని కోరారు. ఆ మేరకు శనివారం ఆయన ఇంటికి చేరుకున్న సచివాలయ ఉద్యోగులు పింఛను ముట్టజెప్పారు. అయితే పింఛను ఆలస్యం కావడం, ఎండ వేడిమి తోడు కావడంతో అయ్యన్న పింఛను అందుకున్న కొద్దిసేపటికే మరణించాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ బి.తాండ్రపాడు గ్రామానికి చేరుకొని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలకు వేళాయె!


ఆలయంలో కొలువైన చౌడేశ్వరిదేవి అమ్మవారు


ఆలయ ఏరియల్ వ్యూ

- ఈ నెల 9 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- భారీగా తరలిరానున్న భక్తులు

బనగానపల్లె రూరల్: శక్తిమాతగా పేరుపొందిన బనగానపల్లె మండలం నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు ఏడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. 9న ఉదయం గణపతి పూజ, అంకురార్పణ, పంచాగశ్రవణం, సాయంత్రం 5 గంటల నుంచి పన్నేరపు బండ్లు తిప్పుట, అనంతరం ప్రాకార రథోత్సవం, 10వ తేదీ రాత్రి నుంచి శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ చేన్నకేశవస్వామి కల్యాణోత్సవం, అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం, 11వ తేదీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు అమ్మవారి రాయబారాది మహోత్సవం, 12న ఉదయం శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి పట్టువస్త్రాల అలంకరణ, రాత్రి 12 గంటలకు శ్రీ భాస్కరయ్య ఆచారిచే అమ్మవారికి దిష్టి చక్క పెట్టుట, రాత్రి ఒంటి గంటకు శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం అంగరంగవైభవం జరుగుతుంది. 13న సాయంత్రం అమ్మవారి రథోత్సవం, 14వ తేదీ సాయంత్రం తిరుగు రథోత్సవం, 15న వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉత్సవాలకు తరలి వచ్చే భక్తులకు వసతి, మంచి నీటి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తెలిపారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ


ఆస్పరి సీఐ హనుమంతప్ప సమక్షంలో ఆటోలో మరచిపోయిన బంగారు ఆభరణాలను శోభకు అందజేస్తున్న డ్రైవర్ బ్రహ్మయ్య

ఆస్పరి: ఆటోలో మరచిపోయిన బంగారు ఆభరణాలను తిరిగి ఇచ్చి చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బ్రహ్మయ్య తన నిజాయితీని చాటుకున్నారు. ఆస్పరి సీఐ హనుమంతప్ప తెలిపిన వివరాల మేరకు.. శనివారం ఆస్పరి చేరుకునేందుకు శోభ అనే మహిళలో ఆదోనిలో బ్రహ్మయ్య ఆటో ఎక్కింది. ఆస్పరికి వచ్చిన తరువాత ఆత్రుతలో ఆటోలో తన బ్యాగు మరచి ఇంటికి వెళ్లింది. ఆటోలో ఉన్న బ్యాగును చూసిన డ్రైవర్ నేరుగా ఆస్పరి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐ హనుమంతప్పకు విషయం చెప్పారు. ఆస్పరిలో ఉన్న శోభను పిలిపించి ఆమె ఎదుటనే బ్యాగును తెరచి చూడగా రూ. 2.50 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, కొంత నగదును కనిపించారు. వాటిని మహిళకు అప్పగించారు. పోగొట్టుకున్నానుకున్న సొమ్ము దొరకడంతో శోభ సంతోషపడుతూ డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీగా వ్యవహరించిన ఆటో డ్రైవర్ బ్రహ్మయ్యను సీఐ అభినందిస్తూ ప్రోత్సాహకంగా సొంతంగా రూ. 2 వేలు అందజేశారు.

అరుణాచల్‌ప్రదేశ్ మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యం, బైక్‌ను చూపిస్తున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వెంకటాపురం కాలనీలో అక్రమంగా విక్రయిస్తున్న 23 బాటిళ్ల అరుణాచల్‌ప్రదేశ్ మద్యాన్ని ఆంజనేయులు అనే వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యం, బైక్‌ను మీడియాకు చూపించారు. మద్యం బాటిళ్లతో పాటు ఒక బైక్, సెల్ ఫోన్ సీజ్ చేసినట్లు చెప్పారు. ఆంజనేయులు అనే వ్యక్తి విజయవాడ వరకు బస్సులో, అక్కడి నుంచి ట్రైన్‌లో అరుణాచల్‌ప్రదేవ్ వెళ్లి మద్యాన్ని తీసుకొచ్చి విక్రయించేవాడని తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 42 వేలు ఉంటుందని చెప్పారు. ఆంజనేయులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసే వెంటనే తన సెల్ నెంబర్ 9440902579కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, హెచ్‌సీ లింగప్రసాద్, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి, భరత్, లక్ష్మన్న, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ మూల్యాంకనం

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ బోర్డు ఆధ్వర్యంలో జవాబు పత్రాల మూల్యాంకనం అత్యంత వేగంగా నిర్వహించారు. గతేడాది వరకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకనం కర్నూలులో నిర్వహించగా, జిల్లాల పునర్విభజన అనంతరం ఈ ఏడాది తొలిసారిగా జిల్లా కేంద్రమైన నంద్యాల ప్రభుత్వ బాలికల కళాశాలలో నిర్వహించారు. మార్చి 9న సంస్కృతం పరీక్షతో ప్రారంభమైన మూల్యాంకనం శుక్రవారం సాయంత్రానికి రసాయన శాస్త్రం జవాబు పత్రాల వాల్యుయేషన్‌తో ముగిసింది. చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, చీఫ్ కోడింగ్ ఆఫీసర్లు మొత్తం 500 మందితో మూల్యాంకనంలో భాగస్వాములయ్యారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి చేరుకున్న 1,99,437 ఇంటర్ మొదటి, రెండు సంవత్సరాలకు చెందిన జవాబు పత్రాలను వివిధ సబ్జెక్టులలో నిష్ణాతులు 28 రోజుల పాటు దిద్దారు. ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా విద్యాశాఖాధికారి సునీత నేతృత్వంలో ఈ ప్రక్రియను చేపట్టారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ అన్ని సబ్జెక్టులు కలిపి అన్సర్ స్క్రిప్టును వాల్యుయేషన్ చేశారు. ఈ ప్రక్రియలో 500 మంది ఆసిస్టెంటు ఎగ్జామినర్లు పాల్గొన్నారు. మూల్యాంకనం చేసిన పేపర్లను 118 మంది పరిశీలకులు తనిఖీ చేశారు. అలాగే మూల్యాంకన ప్రక్రియలో 296 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 55 మంది అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, జెన్ 1. జెన్ 2, ఇద్దరు చీఫ్ కోడింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. స్కానర్ ఇన్‌చార్జ్, కోఆర్డినేటర్లు మార్కులను పోస్ట్ చేశారు.

స్పాట్‌లోనే మార్కులు..

సాధారణంగా ఇప్పటి వరకు మూల్యాంకనం అనంతరం ఓఎంఆర్ షీట్‌లోని పార్ట్- 3 (మార్కులు నమోదు చేసిన షీట్)ను విడదీసి బండిల్స్ ఇంటర్మీడియెట్ బోర్డుకు పంపించేవారు. అక్కడ బోర్డు అధికారుల పర్యవేక్షణలో ఓఎంఆర్ షీట్ పార్ట్-3లో మార్కులను స్కానర్ ద్వారా స్కాన్ చేసి, మార్కుల నమోదు అనంతరం ఫలితాలను ప్రకటించేవారు. ఈ ప్రక్రియలో ఉన్న జాప్యాన్ని తగ్గించేందుకు ఇంటర్ బోర్డు అధికారులు ఈ ఏడాది తొలిసారిగా ప్రతి స్పాట్ కేంద్రానికి స్కానర్లు అందజేశారు. విద్యార్థికి నష్టం లేకుండా స్కానింగ్ అనంతరం మరొకసారి మార్కుల నమోదును నిర్ధారించడం వల్ల విద్యార్థికి నష్టం కలగదు. స్కానర్ ద్వారా స్పాట్ కేంద్రంలో మూల్యాంకనం చేసిన అనంతరం మార్కులు నమోదు చేశారు. ఈ నెల 12న ఫలితాలు వచ్చే అవకాశముంది.